క్లుప్తంగా

హుండీలోని కానుకల లెక్కింపు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీల కానుకలను శుక్రవారం ఆలయ ఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. 2024 మార్చి నుంచి 2025 మార్చి వరకు ఆదాయం రూ.86,051 వచ్చినట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. అలాగే ఈ నెలలో నిర్వహించే స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటను బొగ్గుల నాగలక్ష్మి రూ.36,800లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు శేఖర్, ఎస్ఆర్ఆర్ అభిలాష్ వర్మ, సత్యనారాయణ, ఆనంద్, వెంకటసాయి కృష్ణ తదితరులు ఉన్నారు.

జాజిరి ఆట ప్రారంభం



వాజేడు: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జాజిరి ఆటను ప్రారభించారు. హోలీ పండుగకు పది రోజుల ముందు జాజిరి ఆటను ప్రారంభించి కామ దహనం వరకు తొమ్మిది రోజులు ఆడుకుంటారు. పిల్లలు, పెద్దలతో పాటు యువకులు, మహిళలు కూడా జాజిరి ఆడుతారు. కాముడి దహనం తరువాత హోలీ నిర్వహించుకుంటారు.

సరుకుల పంపిణీ



మంగపేట: మండలంలోని తిమ్మంపేట నేతకానివాడలో గోమాసు సమ్మయ్య ఇల్లు అగ్నిప్రమాదంలో ఇటీవల దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబానికి శ్రీ లక్ష్మీనర్సింహా దత్తసేన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. మండల అధ్యక్షుడు నూతులకంటి ఈశ్వర్‌చంద్, సభ్యులు రాంమ్మోహన్, సాబయ్య, గౌరిశంకర్, తిమ్మంపేట గ్రామస్తులు దీగొండ కాంతారావు, బాబు, దుర్గం నర్సింహారావు, సంతోష్, రాంబాబు, శశి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని అందించాలి

ములుగు రూరల్: జంగాలపల్లి క్రాస్ రోడ్డు ప్రజలకు మిషన్ భగీరథ నీరు రెండు నెలల నుంచి రావడం లేదని గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జంగాలపల్లి క్రాస్‌రోడ్డు వాసులు మాట్లాడుతూ.. గ్రామం మూడు పంచాయతీలు జంగాలపల్లి, బంజరుపల్లి, ఇంచర్ల గ్రామాల మధ్య ఉందని అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు పలుమార్లు తెలియజేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి జంగాలపల్లి క్రాస్ రోడ్డు వాసులకు మిషన్ భగీరథ నీటిని అందించాలని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, తన గెలుపు కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని, అందు కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా నాయకులు రాంనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అధికారుల పొలంబాట



టేకుమట్ల: టేకుమట్ల సెక్షన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేష్ మాట్లాడుతూ రైతులు వారి వ్యవసాయ బోర్లు, బావుల వద్ద గల మోటర్ల స్టాటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్టార్టర్ల వద్ద విద్యుత్ సమస్య ఏర్పడితే విద్యుత్ అధికారుల సూచన మేరకు అనుభవజ్ఞులైన టెక్నీషియన్లతో మరమ్మతులు చేపించుకోవాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఏఈలు విశ్వాస్‌రెడ్డి, మణిదీప్, లైన్‌మెన్ రఘు, కిరణ్, రైతులు ఉన్నారు.

కార్యాలయాలు ఎక్కడ?



గతంలో నిర్వహించిన వాజేడు రేంజ్ కార్యాలయం



గణపురం అటవీశాఖ క్వార్టర్స్‌లో గతంతో నిర్వహించిన దూలాపురం రేంజ్..

- వెంకటాపురం(కె)లోనే అటవీ రేంజ్ కార్యకలాపాలు
- మండలంలో లేని భవనాలు

వాజేడు: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం భూపాలపల్లి కొత్త జిల్లాలో వాజేడు మండలాన్ని కలిపిన తొలినాళ్లల్లోనే మండలంలో వాజేడు, దూలాపురం రేంజ్ కార్యాలయాలను నూతనంగా ప్రారభించారు. మండల కేంద్రంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని కార్యాలయం ప్రారభించగా దూలాపురం రేంజ్ కార్యాలయాన్ని ఘణపురం గ్రామంలో ఉన్న అటవీశాఖ క్వార్టర్స్‌లో ప్రారంభించారు. ప్రారంభ సమయంలో బాగానే నడిచినప్పటికీ క్రమేనా కార్యకలాపాలను వెంకటాపురం(కె)లోని సబ్ డివిజన్ కార్యాలయానికి మార్చారు. ప్రస్తుతం అన్ని కార్యకలాపాలను అక్కడి నుంచే నిర్వహిస్తున్నారు.

నిర్వహణకు లేని భవనాలు

మండలంలోని రెండు రేంజ్ కార్యాలయాలకు సొంత భవనలు లేవు. ఒకటి అద్దె ఇంట్లో నిర్వహించి తొలగించగా, దూలాపురం రేంజ్ కార్యాలయం ఘణపురంలోని అటవీశాఖ క్వార్టర్స్‌లో నిర్వహించి అక్కడి నుంచి వెంకటాపురం(కె)కు మార్చారు. సొంత భవనాలు లేక పోవడంతో వెంకటాపురం(కె)లోని సబ్ డివిజనల్ కార్యాలయంలో కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. మండలంలోనే రెండు రేంజ్ కార్యాలయాలకు కొత్త భవనాలను మంజూరు చేసి కార్యకలాపాలను ఇక్కడి నుంచే నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా, మండలంలోని సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులకు మాత్రం మండలంలో తమకు నిర్మించిన క్వార్టర్స్‌లో ఉండి విధులను నిర్వహిస్తుండగా మరి కొందరు అద్దె ఇంటిని తీసుకుని ఉంటున్నారు.

> **వెంకటాపురం(కె)లోనే కొనసాగిస్తున్నాం..**
>
> వెంకటాపురం(కె)లోని సబ్‌డివిజన్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవనాల్లో కార్యకలాపాలను కొనసాగిస్తున్నాం. సెక్షన్, బీట్ ఆఫీసర్లు కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో కొన్ని చోట్ల భవనాల నిర్మాణం పూర్తి కాగా వారికి కేటాయించాం. వారు అక్కడే ఉండి ఫీల్డ్‌కు సంబంధించిన విధులను నిర్వహిస్తున్నారు.
>
> – చంద్ర మౌళి, రేంజర్, వాజేడు

పరిహారం చెల్లించే వరకూ పోరాటం



వెంకటాపురం(కె): మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు



వాజేడు: ఏఈఓకు వినతిపత్రం ఇస్తున్న దామోదర్

వెంకటాపురం(కె): మండలంలో బాండ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందే వరకూ వారికి సీపీఎం అండగా ఉండి దశల వారిగా పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలిపాక, తిప్పాపురం, కొత్తగుంపు గ్రామాల్లో రైతులు నష్టపోయిన మొక్కజొన్న పంటను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.లక్ష ఇరవై వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు కంపెనీల నుంచి వచ్చే రాయితీలు, సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్పా శ్రీను, సోలం రంగయ్య, పర్శిక కృష్ణ, మడకం చంద్రరావ్, సోడి ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

పరిహారం ఇప్పించాలి

వాజేడు: మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష నష్ట పరిహారం కంపెనీ నుంచి ఇప్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జజ్జరి దామోదర్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఘణపురం కాలనీ, కొప్పుసూరు, అరుణాచలపురం, ఆరుగుంటపల్లి, బొల్లారం గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి ఏఈఓ జాఫర్‌కు మొక్కజొన్న పంట నష్టంపై ఫిర్యాదు చేశారు. ఆయన వెంట కుర్సం ప్రవీణ్, శాంత కుమారి, కృష్ణ బాబుతో పాటు తదితరులు ఉన్నారు.

13 మంది గైర్హాజరు

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షల్లో శుక్రవారం 13 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ కోగిల విజయ్ కుమార్ తెలిపారు. జెనరల్‌లో 157 మందికి గాను 147 మంది విద్యార్థులు ఒకేషన్‌లో 24 మందికి గాను 21 మంది పరీక్షలకు హాజరయ్యారు.

ఇసుక లారీలను విడుదల చేయాలి

- అటవీశాఖ కార్యాలయం ఎదుట డ్రైవర్ల ఆందోళన



అటవీశాఖ, టీజీఎండీసీ అధికారులను ప్రశ్నిస్తున్న లారీ డ్రైవర్లు

ఏటూరునాగారం: అటవీశాఖ అధికారులు పట్టుకున్న ఇసుక లారీలను వెంటనే విడుదల చేయాలని ఇసుక లారీ డ్రైవర్లు శుక్రవారం అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అటవీశాఖ, టీజీఎండీసీ అధికారులను లారీలు విడుదల చేయాలని కోరారు. ఏటూరునాగారం మండలం చెక్ పోస్ట్ వద్ద ఏడు ఇసుక లారీలను సీజ్ చేసి అటవీశాఖ కార్యాలయానికి అధికారులు తరలించారు. ఈ లారీలు మండల కేంద్రంలోని మానసపల్లి ఇసుక ర్యాంపు నుంచి లోడ్ అయినవి. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి ఇసుక క్వారీ నిర్వహించొద్దంటూ, నిబంధనలు ఉల్లంఘించారని వాటిని సీజ్ చేశారు. టీజీఎండీసీలో ఆన్‌లైన్ చేసుకుని వచ్చిన లారీలను ఎలా సీజ్ చేస్తారంటూ లారీ డ్రైవర్లు మండిపడ్డారు. రెండు రోజులుగా సీజ్ చేసిన లారీలను వదిలివేయకపోవడంతో టీజీఎండీసీ పీఓ, ఫారెస్ట్ అధికారులను లారీ యజమానులు, డ్రైవర్లు నిలదీశారు. తమ లారీలకు వే బిల్లులు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో స్లాక్ పెడితే డీడీలు తీసుకొని ఇసుకను లారీల్లో లోడింగ్ చేయించుకున్నామన్నారు. అలాంటి లారీలను రెండు రోజులుగా నిలిపివేయడం ఏమిటని మండిపడ్డారు. వెంటనే లారీలను విడుదల చేయకుంటే రోడ్డుపై రాస్తారోకోకు దిగుతామని హెచ్చరించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతి



బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డులో గల ఆంజనేయస్వామి ఆలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆంజనేయస్వామి భారీ విగ్రహం ప్రతిష్ఠాపనకు సహకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, నాయకులు, గ్రామస్తులు శుక్రవారం కోరారు. మంత్రిని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలుసుకొని వినతి పత్రాన్ని అందజేశారు. 45 ఫీట్ల విగ్రహం ఏర్పాటు పనులు చేపట్టినట్లు లక్ష్మీనర్సింహరావు తెలిపారు. అయితే జాతీయ రహదారి ఉండడం వల్ల ఆ విగ్రహం రోడ్డు పనులకు అడ్డువస్తుందని అధికారులు చెబుతున్నారని వివరించారు. విగ్రహం ఎదుట ఉన్న ఖాళీ స్థలం నుంచి కూడా రోడ్డు పనులు చేయవచ్చని మంత్రికి తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు పునరాలోచన చేసేలా చూడాలని కోరారు. ఆంజనేయస్వామి విగ్రహం గ్రామానికి రక్షణ కోసం నిర్మిస్తున్నట్లుగా మంత్రికి వివరించారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి బండి సంజయ్ సంబంధిత నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్ చేసి విగ్రహానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు చేయాలని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రఘు, మల్లారెడ్డి, శ్రీను, దీనబాంధవస్వామి, గంపల నర్సయ్య, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర చెల్లించాలి



మిర్చి కల్లాలను పరిశీలిస్తున్న నాయకులు

- బీఆర్ఎస్ నాయకుడు గోవింద్‌నాయక్

ములుగు రూరల్: రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన మిర్చికి గిట్టుబాటు ధర చెల్లించాలని బీఆర్ఎస్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని సర్వాపూరంలో మిర్చి కల్లాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చి పంటకు వేరుకుళ్లు, నల్లి ఆశించి దిగుబడి తగ్గిపోయిందని అన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి మిర్చి సాగు చేస్తే ధర లేకపోవడంతో రైతులు అప్పులపాలు అవుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి పంటను మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు. మిర్చికి క్వింటాకు రూ. 25 వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అప్పాజీ అయిలయ్య, లక్ష్మీనారాయణ, నర్సింహులు, శ్రీను, తిరుపతి, భిక్షపతి, నరేష్, చుక్కయ్య, గణేష్, భాగ్య, కనకయ్య పాల్గొన్నారు.

వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మాజీ ఎమ్మెల్యే భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పోదెం వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంకోసం నిరంతరం కృషి చేస్తున్న పోదెం వీరయ్యకు ఎమ్మెల్యేల కోటలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకుల సైయ్యద్ హుస్సేన్, చిడెం శివ, మన్నెం సునీల్, పిల్లారి శెట్టి మురళి, రమేష్, చిట్టెం సాయి, యాలం సాయి, గార్లపాటి రవి తదితరులు ఉన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత



సామ్రాజ్యాన్ని సన్మానిస్తున్న సుగుణ

- ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత

ఏటూరునాగారం: మహిళల్లో చైతన్యం వచ్చినప్పుడే మహిళా దినోత్సవానికి పూర్తి సాధికారత చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఏటూరునాగారం ప్రాజెక్టు ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాలకు చెందిన వివిధ సెక్టార్ సూపర్‌వైజర్లు, అంగవాడీ టీచర్లు హాజరయ్యారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన అభ్యసన కిట్‌లను ఉపయోగించి పిల్లలకు బోధన చేయాలన్నారు. మహిళల్లో చైతన్యం వచ్చినప్పుడే మహిళా దినోత్సవానికి పూర్తి సాధికారత చేకూరుతుందన్నారు. అనంతరం స్థానిక వైద్యాధికారిని సుమలత, జీసీడీఓ రమాదేవిలు మహిళల ఎదుగుదలపై వివరించారు. అలాగే ఇటీవల పదవి విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పవతి, ఆఫ్రిన్, శ్రీవిద్య, వెన్నెల, కమల, విజయలక్ష్మి, విజయకుమారి, చంద్రకళ, ఆఫీస్ సిబ్బంది మీర్జా బేగ్, ఇమ్రాన్, వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఐక్యంగా ఉండాలి

తోటి మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు మహిళలు ఐక్యంగా ఉండి సమస్యకు పరిష్కారం చూడాలని జీసీడీఓ సుగుణ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగపేట వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలు కొమరగిరి సామ్రాజ్యం కేశవరావుల దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా జీసీడీఓ మాట్లాడుతూ.. సామ్రాజ్యం మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తమ వంతుగా సేవలు చేస్తున్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరాలని తెలిపారు. ప్రిన్సిపాల్ రేణుక, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యామలత, అధ్యాపకులు నవీన్, వెంకటయ్య, జ్యోతి, సంపత్, మున్ని, జీవవేణి, రమేశ్, శేఖర్, సుమలత, అభిలాష్, భావన, భాస్కర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమ్మక్క పగిడిద్దరాజు కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు, వడ్డెలు

మంగపేట: మండలంలోని మామిడిగూడెంలో కొనసాగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున సమ్మక్క పగిడిద్దరాజు కల్యాణ మహోత్సవాన్ని ఆదివాసీ గిరిజన సాంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. జాతర నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా కల్యాణ మహోత్సవం అనంతరం ఆలయ పూజారి (దేవరబాల)పూనెం జనార్దన్ వనదేవత అనుగ్రహంతో దాదాపు గంటన్నర పాటు ముళ్ల ఉయ్యాల ఊగారు. అనంతరం జాతరకు వచ్చిన భక్తులు సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెలు రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, నిర్వాహకులు వాసం సాంబశివరావు, ఎట్టి సాయి, తాటి చందు, నాగమల్లేశ్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన ఓదెల సాంబయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అహ్మద్‌పాషా పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుబానికి 50 కేజీల బియ్యం, రూ.2500 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎన్నిండ్ల ప్రదీప్, మద్దెల రితీష్ కుమార్, మర్రి సంపత్, భరత్, రాజు, వేణు తదితరులు ఉన్నారు.

ట్రైబల్ జర్నలిస్టులకు శిక్షణ ఇప్పించాలి



పీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

ఏటూరునాగారం: ట్రైబల్ జర్నలిస్టులకు శిక్షణ ఇప్పించాలని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న అన్నారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ కార్యాలంయలో పీఓ చిత్రామిశ్రాకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. ట్రైబల్ జర్నలిస్టులకు చట్టాలు, ప్రభుత్వం పాలనపై అవగాహన కలిగి ఉండాలని ఈ మేరకు శిక్షణ ఇవ్వడానికి ఐటీడీఏ సహకరించాలన్నారు. దీంతో పీఓ సానుకూలంగా స్పందించి ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల కలెక్టర్ల అనుమతితో డీపీఆర్ఓ ద్వారా రెఫరెన్స్ అందేలా చూడాలన్నారు. మీడియా తరపున ఇద్దరు కో ఆర్డినేటర్లను ఎంచుకొని ప్రణాళిక రూపొందించి అందించాలన్నారు. ఐటీడీఏ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా ట్రైబల్ జర్నలిస్టులకు సమస్య వచ్చినట్లయితే వెంటనే సమాచారం అందించాలని సంబంధిత సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గౌరవధ్యక్షులు భూక్య సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుచ్చంటి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు పూనెం ప్రతాప్, కోశాధికారి తుర్స చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్, సుధాకర్, ఏటూరునాగారం డివిజన్ కమిటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి శివలింగ ప్రసాద్, కేతిరి భిక్షపతి, యోగి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాదిగ ఎమ్మెల్యేలకు చోటివ్వాలి



రహదారిపై డప్పు ప్రదర్శన ఇస్తున్న నాయకులు

ములుగు: మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు మాదిగ ఎమ్మెల్యేలకు చోటివ్వాలని కోరుతూ జిల్లాకేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహం నుంచి జాతీయ రహదారి మీదుగా ఏరియా ఆస్పత్రి వరకు శాంతియుత భారీడప్పుల మహా కళా ప్రదనర్శన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మారాతి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఇరుగు పైడిమాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంమాదిగ మాట్లాడారు. శాస్త్రీయ బద్ధంగా జనాభా దామాషాన ఎస్సీలను ఏబీసీడీలుగా విభజిస్తేనే సామాజిక న్యాయం దక్కుతుందని అన్నారు. 15 లక్షల మంది జనాభా ఉన్నవారికి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు 32 లక్షల పైచిలుకు జనాభా ఉన్న ఎస్సీలకు తొమ్మిది శాతం అమలు చేస్తుండడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, కడప శ్యాం, సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, గజ్జల ప్రశాంత్, రొంటాల భిక్షపతి, కోతి కార్తీక్, దూడపాక రాజు, జాషు, నరేష్, ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల అధ్యక్షులు రమేష్, తోకల శివ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



మాట్లాడుతున్న నాగరాజు

వాజేడు: వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఇప్పగూడెం, బీజినేపల్లి, కృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు మొక్కజొన్న పంట నష్టపోయామని తెలపాడానికి కార్యాలయానికి వస్తే మూసి ఉందని వాపోయారు. కలెక్టర్ దివాకర్ మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని జారీ చేసిన వ్యవసాయ అధికారులు చేయడం లేదని ఆరోపించారు.